ఓం నమోభగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర



సంపుటి : 4 సంచిక : 23 పుష్పం :28 ఎడిటర్ : శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 25-2-99 గుమ్ములూరు)**

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

మనం సంసారరతిని దాటాలి. అది మీరు అనుకున్నంత తేలిక కాదు. దీనిని దాటటానికి భక్తిమార్గమో, ధ్యానమార్గమో, కర్మమార్గమో ఏదో మార్గమును ఆశ్రయించాలి. ఆశ్రయించినంత మాత్రంచేత సరిపోదు భగవదనుగ్రహం పొందాలి. భగవదనుగ్రహం పొందకపోతే మనం కోటజన్మలు ఎత్తినా మనకు భగవదనుభవం కలుగదు. ఎవరైనా ఆకలితో బాధపడుతూ ఉంటే అన్నం పెట్టటం స్నేహధర్మం, ఎవరైనా ఇబ్బందిలో ఉన్నారు అనుకోండి ఆ ఇబ్బందిలో సహాయం చేయటం స్నేహధర్మం. తల్లి బిడ్డల మధ్య ప్రేమ, ఆప్యాయత ఎలా ఉంటుందో అలాగ కొంతమంది భగవంతుని యందు చాలా ప్రేమ కలిగి ఉంటారు దానిని మధుంభక్తి అంటారు. ఇంటిలో పనిచేసేవారు యజమాని పట్ల ఎలా ఉంటారో కొంతమంది దేవునిపట్ల అలాగ ఉంటారు. దానిని దాస్యభక్తి అంటారు. ఏదో ఒకటి చాలు మనం తరించటానికి. మన మనస్సుకు ఇష్టమైన మార్గంలో ప్రయాణం చేయవచ్చు. భక్తిమార్గంలో ఆలంబనం ఉండాలి. ఒక అవతారపురుషునిగాని, గురువును గాని ఆలంబనముగా పెట్టుకోవాలి. ఆలంబనవలన భక్తి అభివృద్ధి అవుతుంది. మనం ఏ మార్గంలో ప్రయాణం చేసినా ఇంద్రియనిగ్రహం, మనో నిగ్రహం ఉండాలి. భక్తివలన ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం వస్తాయి. మనం సాధన చేస్తున్నప్పటికి ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం రాకుండా గమ్యానికి చేరలేము. పూర్వజన్మలో ఏ మార్గంలో ప్రయాణం చేసామో ఆ మార్గంవైపుకు ఈ జన్మలో ఆకర్షణ కలుగుతుంది. భక్తిమార్గంలో మీరు ప్రయాణం చేస్తూ ఉంటే కర్మమార్గాన్ని, జ్ఞానమార్గాన్ని సపోర్టుగా తీసుకోవాలి. ఏ మార్గంలో ప్రయాణం చేసిన మిగిలిన మార్గాలను సపోర్టుగా తీసుకోవాలి.

పెద్దలకు ఎంతో కొంత సేవచేస్తే, మనకు ఎంతో కొంత తపస్సు ఉంటే అప్పుడు భగవంతుడు చెప్పిన వాక్యం యొక్క విలువ మన గుండెకు తాకుతుంది. లేకపోతే ఆ మాట యొక్క విలువ మనకు తెలియదు. మనలో చాలా బలహీనతలు ఉంటాయి. కొన్ని బలహీనతలు మనకు తెలుస్తాయి, కొన్ని బలహీనతలు మనకు తెలియవు. వాటిని ఎలా మనకు తెలియజేయాలి, వాటిని ఎలా తొలగించాలి అని గురువు చూస్తాడు. ఆ బలహీనతలు మనకు తెలియజేసే సంఘటనలు కల్పించి, వాటిని తొలగించుకోవటానికి ఎంతోకొంత సాధన చేయించి, ఆవంపుతో బలహీనతలను తొలగిస్తాడు వాడు గురువు. సంయక్ జ్ఞానము అంటే

ఈ సృష్టిలో ఏ వస్తువు మీద, ఏ పదార్థం మీద కాంక్ష లేకుండా ఉండటం. ప్రపంచంలో ఉన్న వస్తువుల మీద మనస్సు వాలకుండా ఉండటం. వస్తువులను మనం చూడవచ్చు, అవసరమైతే వాటిని వాడుకోవచ్చు కాని ఏ వస్తువు మనలను మోహపర్చకూడదు. మనం మోక్షంలోనే ఉన్నాము. ఉన్నామని మనకు తెలియటంలేదు. తెలియకపోవటం వలన మనకు పునర్జన్మలు వస్తున్నాయి. సంసారరతిలో కొట్టుకొని పోతున్నాము. ఏదైతే నీలోపల నేనుగా వ్యక్తమవుతోందో జాగ్రదావస్థలో అస్తమానూ ఆ నేనుతో కలిసి ఉంటున్నావు. నేను అది చేసాను, నేను ఇది చేసాను, నేను వాడికి ఉపకారం చేసానును, నేను ఆ మంచి పని చేసాను అంటావు. ఈ మాటలు నీ శరీరం చెప్పటంలేదు. మీకు ఏదైతే నేనుగా వ్యక్తమవుతోందో అదే ఈ మాటలు చెపుతోంది. నేను పూజచేసాను, జపం చేసాను అని చెప్పేది కూడా ఈ నేనే. మనం దేనినైతే పోగొట్టుకోవాలో అదే ఈ మాటలు అన్నీ చెపుతోంది. ఇలా అస్తమానూ జరిగిపోయిన గొడవలు తలపెట్టుకోవటం వలన మనకు ఏదైతే నేనుగా వ్యక్తమవుతోందో అది పెరిగిపోతుంది. మర్చిపోవటం ఉత్తమమైన మందు. మీరు ఏది చేసినా ఈ నేనులోనుండి ఎలా విడుదల పొందాలి అనేది గమ్యంగా పెట్టుకొంటే అందులోనుండి బయటకు వచ్చేస్తారు. మీ నోటినుండి ఎప్పడైనా పొరపాటు మాటలు రావచ్చును. ఈ నేనేకదా ఇవి అన్నీ చెప్పించేది అని అర్థం చేసుకొని అందులోనుండి విడుదలపొందితే ఈ జన్మలోనే మోక్షాన్ని పొందుతారు. ఏ ఇంద్రియానికి ఏ బలహీనత ఉందో ఆ ఇంద్రియం ద్వారా మనస్సు బాహ్యముఖమవుతుంది. ఏ కారణం వలన నీ మనస్సు బాహ్యముఖమవుతోందో నీకు తెలుస్తూ ఉంటుంది. అప్పడు నీ మనస్సును తీసుకొనివచ్చి, నీ ఇష్టదేవత మీద నిలబెట్టు. అలాచేస్తూ ఉంటే ఏ కారణం వలన నీ మనస్సు బాహ్యముఖమవుతోందో ఆ కారణం నెమ్మదిగా తగ్గుతుంది. ఆ కారణం కొన్ని వేల జన్మల నుండి వస్తోంది. మొదట కష్టం అనిపిస్తుంది. కొంత సాధనాబలం పెరిగాక అది నీకు లోకువ అవుతుంది. అప్పడు అది సన్నగిల్లి నశిస్తుంది. నీకు ఉదారగుణం, ధాతృత్వం ఉండవచ్చు. వీటివలన మనోనిగ్రహం కలగాలి. ఎప్పడైతే మనోనిగ్రహం కలిగిందో అప్పడు మనస్సుకు అంతర్దృష్టి కలుగుతుంది. అంతర్దృష్టి కలిగిన మనస్సుకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. ఏదైనా శాస్త్రం చదివేటప్పడు దానిని ఇముడ్చుకోవాలి. ఇముడ్చుకొంటే అధ్యయనం ఆధ్యాత్మిక అభివృద్ధిని తీసుకొని వస్తుంది, ఇముడ్చుకోకపోతే మనస్సులో వికారములు వస్తాయి. మోక్షమే మన సహజస్థితి. మానసికవ్యాపారం పెరిగిపోవటంవలన నీకు స్పష్టతలేక నీలోపలఉన్న సహజస్థితి నీకు అందటంలేదు.

మీరు ఏ మార్గంలో ప్రయాణంచేసినా మీరు బాగుపడటం ముఖ్యం, జ్ఞానఫలం అందుకోవటం ముఖ్యం. దేహం చనిపోయినప్పడు మనం చనిపోతున్నాము అనుకొంటాము. అంటే మనం మృతంలో ఉన్నాము. దైవానుగ్రహానికి పాత్రులు అయినప్పడు మృతంలోనుండి

అమృతంలోనికి వస్తారు. అప్పుడు దేహం మరణించిన మీకు మరణం లేదు అని మీకు తెలుస్తుంది. మనకంటే మంచిభక్తులు ఉన్నారు అనుకోండి, ఎక్కువ చైతన్యస్థాయి కలిగినవారు ఉన్నారు అనుకోండి వారిని చూసి అసూయపడకండి, వారిని అధిగమించటానికి ప్రయత్నం చేయండి. పరమేశ్వరుని ప్రార్థించగా, ప్రార్థించగా శక్తిని నీకు ఇస్తాడు. అప్పుడు ఎన్ని వాసనలు ఉన్నా అందులోనుండి బయటకు వచ్చేస్తావు. ఈశ్వరునిపట్ల ప్రీతి, ప్రేమ పెరుగుతూ ఉంటే ఏ అలవాట్లు అయితే నిన్ను పీడిస్తున్నాయో వాటిని మీరు పొండి, మీరు పొండి అని ప్రత్యేకంగా అడగనక్కరలేదు వాటిఅంతట అవే పోతాయి. పూర్వజన్మలలో ఏ విషయాలు అయితే అనుభవించావో అవి అన్నీ ఇప్పుడు తలంపులుగా వస్తాయి. ఈ తలంపులలోనుండి విడుదల పొందటం ఒక్క రోజులో జరుగదు. దీనికి స్వప్రయత్నం, కాలపరిపక్వం, ఈశ్వరకటాక్షం అవసరం. ఏదో కాలంలో పుట్టావు. మరల ఏదో కాలంలో చనిపోతావు. ఏదో కాలం నిన్ను ప్రారబ్ధం అనుభవించటానికి ఈ భూమి మీదకు తీసుకొనివచ్చింది. ప్రారబ్ధం అనుభవించిన వెంటనే ఆకాలమే నిన్ను తీసుకొనిపోతుంది. ఏ కాలమైతే నీ దేహాన్ని ఈ భూమి మీదకు తీసుకొనివచ్చిందో అదే కాలం నీ దేహాన్ని ఈ భూమి మీదనుండి తీసుకొని పోతుంది. అది ఎవరో అనుకోకు ఆ కాలాన్ని నేను అని కృష్ణుడు చెప్పాడు. ఇది అంతా భగవంతునికి తెలియకుండా జరుగుతోంది అని అనుకోవద్దు. చేయించేది అంతా భగవంతుడే. కాలం ద్వారా జన్మను ఇచ్చేవాడిని నేనే, కాలం ద్వారా నీ శరీరాన్ని తీసుకొని పోయేవాడిని కూడా నేనే, ఏ కాలంలో మీకు మోక్షానుభవం కలుగుతుందో ఆ కాలాన్ని కూడా నేనే అని కృష్ణుడు చెప్పాడు. గాథల వలన బాధలు వస్తాయి అనేవారు భగవాన్. మీ సంసారంలో ఉన్న బాధలే మీరు భరించలేకపోతున్నారు ఇంక గాథలు చెప్పి బాధలు పెంచటం ఎందుకు అని చెప్పేవారు.

ఆకాశానికి, మేఘానికి ఎటువంటి సంబంధం ఉంటుందో జ్ఞానికి జ్ఞానియొక్క దేహానికి అటువంటి సంబంధం ఉంటుంది అని ఆచార్యులు వారు చెప్పారు. మేఘాలు పైన ఉన్నాయి కాని ఆకాశానికి మేఘాలకు ఏమీ సంబంధంలేదు. అలాగే జ్ఞాని ఒక దేహంలో ఉన్నప్పటికి దేహంతో ఏమీ సంబంధం లేకుండా ఉంటాడు. నీకు ఎన్ని తలంపులు వచ్చినా, నీకు ఎన్ని అలవాట్లు ఉన్నా ఇవి అన్నీ దేహగతమైన నేనుకే. ఈ కష్టాలు, నష్టాలు, బాధలు, హెచ్చుతగ్గులు ఇవి అన్నీ ఈ నేను చుట్టూ తిరుగుతున్నాయి. ఈ సృష్టి అంతా ఏ నేను అనే తలంపు చుట్టూ తిరుగుతోందో ఆ నేను ఎవరు అని ఎందుకు ప్రశ్నించటంలేదు. ఆ నేను ఎక్కడ నుండి వస్తోంది, ఎలా వస్తోంది, ఎలా పనిచేస్తోంది అని ఎందుకు పరిశీలన చేయటంలేదు. అది ఎక్కడనుండి ఉద్భవిస్తోందో ఎందుకు చూడటంలేదు. దేహం ముఖ్యంకాదు. మనస్సు ముఖ్యం. మనస్సులో వచ్చే ప్రతీ కదలిక దేహం మీద పడుతుంది. నీవు నిరంతరము దేహాన్ని చూసుకొంటున్నావుకాని నీ మనస్సును చూసుకోవటంలేదు. ఎవరి ఆజ్ఞను అనుసరించి ఈ

దేహం నడుస్తుందో ఆ మనస్సును నీవు గమనించటంలేదు. ఆ మనస్సును నాయందు నిలబెట్టు. నా శరీరం ప్రారబ్దం అనుభవించటానికి వచ్చిన శరీరంకాదు, మీకోసం ఈ దేహాన్ని సృజించుకొన్నాను. నేను పనిచేస్తున్నాను దీని వలన లౌకికమైన ప్రయోజనం ఏమిలేదు. భగవంతుడే పని చేయకుండా ఉన్నాడని ఈ లోకం చెడిపోకుండా ఉండటంకోసం వారికి ఆదర్శంగా ఉండటంకోసం పనిచేస్తున్నాను అని కృష్ణుడు చెప్పాడు. ప్రతీ చిన్న విషయానికి భయపడవద్దు, కోపం తగ్గించుకో. భయం, కోపం ఇవన్నీ మనస్సును బాహ్యముఖం చేస్తాయి. ఇవి అన్నీ తగ్గించుకోవటమే కాదు నన్ను ఆశ్రయించు. నీ మనస్సుతో నన్ను ఆశ్రయిస్తే నా స్వరూపం నీకు తెలుస్తుంది.

నేను అది చేసాను, నేను ఇదిచేసాను అని అనుకోవద్దు. నేను ఇతరులకంటే ఎక్కువ వాడిని అని అనుకోవద్దు, ఇతరులకంటే తక్కువ వాడిని అనుకోవద్దు. ఇలా అనుకోవటం వలన దేహగతమైన నేను పెరిగిపోతుంది. దేహంయొక్క రంగులు వేరైనా, కులాలు వేరైనా, మతాలు వేరైనా హృదయంలో ఉన్న వస్తువు ఒక్కటే. మీ మాటలలో, చేతలలో, తలంపులలో దేహగతమైననేను పెరిగిపోతోంది అని అర్థం చేసుకోండి. ఇది అర్థం కానంతకాలం మీరు ఒడ్డుకు వచ్చే సమస్యలేదు. మీరు ఏ కులంలోఉన్నా, ఏమతంలో ఉన్నా, ఏ దేవుని ఆశ్రయించినా దేహగతమైన నేను నశించకపోతే మీకు మోక్షానుభవం కలుగదు. అందువలన నేను అది చేసాను, నేను ఇది చేసాను ఇవి రెండూ మర్చిపోండి. అప్పుడు దేహగతమైన నేను తగ్గిపోతుంది. అప్పుడు మోక్షమార్గానికి తలుపులు తెరువబడతాయి. మోక్షం పొందకుండా మీకు మీరే అడ్డువస్తున్నారు, ఇతరులు అడ్డురావటంలేదు. ఈ విషయం అర్థం చేసుకొని ఆచరించి తరించండి.

| | |
|---|---|
| 20-4-99 | ఐ. భీమవరంలో శ్రీనాన్న గారి ప్రవచనము |
| 21-4-99 | ఫత్తేపురంలో శ్రీనాన్నగారి ప్రవచనము |
| 30-4-99 | యానంలో శ్రీనాన్నగారి ప్రవచనము వాయిదా పడినది |

PRINTED & PUBLISHED BY P.S. RAMARAJU AT SHRIRAM GRAPHICS, **PALAKOL** ☎ 24776